
మే నెలాఖరు.
ఎండ మండిపోతోంది.
జగదాంబా జంక్షన్లో, వాల్తేరువేపు పోయే బస్‌స్టాప్‌లో నిలబడ్డాడు సత్యం.

లంచ్ అవర్ వల్లనో, అతని గ్రహచారం చెడో గత పావు గంటై ఒక్క బస్సు కూడా లేదు.




అతని గొంతుకలో తడి ఆరిపోతోంది. బస్‌షెల్టర్ వదలి ఎదర కిళ్లీబడ్డీకి వెళ్లి ఐస్ సోడా తాగేడు. తాగుతున్నంతసేపూ అతని దృష్టి బస్సు వచ్చేవేపే. చిల్లర కోసం వెతుకులాడేడు. అర్థరూపాయి కాసు మాత్రమే దొరికింది. సోడాకు పోను మిగిలిన చిల్లర బస్ టికెట్‌కు సరిపోదు.

పర్స్ తీసి చూసేడు. ఆఖరు పది రూపాయల నోటు. మూడు వారాల క్రితం యదార్థవాదానికి ఫలితంగా ఉద్యోగం ఊడింది. అప్పుడు అందుకున్న జీతంలో ఆఖరు పది రూపాయల నోటుకి రెక్కలు మొలిచి ఎగిరి పోవడానికి సిద్ధంగా వుంది.

పది రూపాయల నోటిచ్చి సిరిపురానికి టిక్కెట్టంటే కండక్టరు కరవరావడం ఖాయం. పోనీ. కిళ్లీబడ్డీవాడి కిస్తేనో-అమ్మో తిట్టి పోసినా తిట్టిపొయ్యొచ్చు.

అలా అనుకొని అర్ధరూపాయి యిచ్చేడు. బడ్డీ అతను పావలా తిరిగిచ్చేడు.

సిరిపురానికి టిక్కెట్టు ముప్ఫయ్యో నలభయ్యో అని అనుకుంటూ తిరిగి బస్ షెల్టర్ ముఖం పట్టేడు. దాహం తీరినట్లు లేదు. ఎన్ని ఐస్ సోడాలు తాగితే ఈ ఎండలో దాహం తీరుతుంది.

షెల్టర్ చేరి రోడ్డువేపు స్తంభంకి ఆనుకొని నీడపట్టున సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. బెంచీ స్తంభం రెండూ వేడిగానే ఉన్నాయి.

షాప్ వెనుక క్రిష్టియన్ సిమెటరీలోని మామిడి కొమ్మల మాటున దాగిన కోయిల కుహూ కుహూ రవాలు తీస్తోంది. కొద్దిగా గాలి వీచింది. వంటిమీది చెమట ఆరటం వల్ల చల్లగా హాయిగా అనిపించింది.

కొమ్మల చాటున కోయిలను వెతక ప్రయత్నించేడు. ఆ ప్రయత్నంలో బాగా వెనుకకు ఒరిగాడు.

ఇనుప స్తంభంమీది చెమటతో తడిసిన -అరచేయి పట్టు జారింది వెనుకకు తూలేడు. బేలన్సు కాసుకోగలిగేడు. గుండె లయ తప్పింది. స్తంభంమీది పట్టు బిగిసింది.

విసురుగా తనను తాను ముందుకు గుంజుకున్నాడు. విసురు ఎక్కువై ముందుకు నెట్టేసింది స్తంభంమీది పట్టు వల్ల రోడ్డుమీదికి తూలేడు. తూలటంలో

స్తంభంమీది చేతి పట్టు తప్పటం కాలు రాయి మీద పడ్డం ఆ వెంటనే రోడ్డు మీద వెల్లకిలా పడిపోడం క్షణంలో జరిగిపోయాయి.

పట్టు తప్పిపోగానే హడలిపోయిన మనిషి తలను రక్షించుకొనే ప్రయత్నంలో రెండు చుట్లు దొర్లుకుపోయేడు. దిగుడు వల్ల ఆ దొర్లుడు స్వాధీనం తప్పిపోతుంటే గాభరాపడిపోయి గట్టిగా అరిచేడు.

తన ప్రయత్నం లేకనే నడుము మీది భాగం దొర్లటం మానేసి కాళ్ళు మాత్రమే గడియారపు ముల్లులా దేకాయి. తన భుజం దగ్గర మెత్తగా బలంగా ఏదో అడ్డు తగిలింది ఏమిటని తడిమి చూసుకున్నాడు.

అరిగి చిరిగిపోనున్న హవాయి చెప్పు. అందులో నల్లని కాలు హాఫ్‌ఫేంట్లో దూరిపోయింది. అందులోంచి వచ్చిన రెండవ కాలి ముడుకు ఫెడలుని అదిమిపట్టి వుంది. పేంటుమీద బనీను. దానిమీద వంగి క్రిందకు చూస్తున్న తల. తలమీద పాగా. సూర్యుడి కిరణాలు కళ్ళల్లో పడి వంగిన ముఖం స్పష్టంగా కనబడనీయటంలేదు.

తలకు రెండు ప్రక్కలున్నుంచి మొలచిన రెండు చేతుల్లో ఒకటి వెనుక బ్రేకులను లాగిపట్టే చివర్ని సీటుదాకా బలంగా లాగిపట్టి వుంచింది. రెండవ చేయి రిక్షాని లాగటానికి ఉపయోగించే కడ్డీని బలంగా పట్టి బండిని వెనుకకు జారనివ్వకుండా ఆపే ప్రయత్నంలో వుంది.

హేండిల్‌బార్ రోడ్డువేపుకి తిరిగి వుంది. ముందు చక్రం తన తలకు అరంగుళం దూరంలో ఉంది. రిక్షావాలా కాళ్ళ వెనుక తన పీకకు గురిపెట్టినట్టుగా వెనుక చక్రం.

వెనుక గొయ్యి ముందు నుయ్యి. బండి ముందుకు కదిలినా వెనుకకు జారినా తన తలో, పీకో!

అంత ఎండలోనూ గజగజ వణికిపోయేడు అతను.

"దెబ్బలు తగలేన్నమగదా! బండిని ఇగ కాయలేను. నెగు....నేవగలవా!" అన్న రిక్షావాలా మాటలు వినబడ్డాయి అతనికి.

ఎండకు నల్లగా మాడిపోతున్న తారు రోడ్డు. శరీరం తగిలిన మేరకు మాడ్చేస్తోంది. చటుక్కున తలను తప్పించుకొని లేచి, నించొని ఒళ్ళు దులుపుకున్నాడు అతను.

"జాగ్రత్త బాబూ! ఒక్క పిటం ముందైనా ఎనకైనా..." అని సగంలోనే ఆపేసి రిక్షాను ముందుకు బలంగా లాక్కుంటూ వెళ్ళిపోయేడు రిక్షాతాత. రిక్షాలో రెండు బియ్యపు బస్తాలు.

రెండు వందల కేజీలు అనుకోగానే అప్రయత్నంగా తన మెడ తడుముకున్నాడు అతను. కాళ్ళలోంచే వణుకు- ఎప్పుడు పుట్టిందో- జరజర మొత్తంశరీరం అంతా ప్రాకిపోతోంది. తనలో శక్తి సన్నగిల్లుతున్నట్లు కాళ్ళు జవజవలాడుతున్నట్లు ఇక నిలబడ్డానికి శక్తి లేనట్లు తూలుతూ షెల్టర్ సమీపించి నీడపట్టున గట్టుమీద చతికిలబడిపోయేడు. సిమెంటు బెంచీకి జారబడి తల వెనుకకు, బెంచీమీదకు జారవిడిచేసి కళ్ళు మూసుకున్నాడు.

కొద్దిసేపటి తరువాత కళ్లు విప్పి చుట్టూ చూసుకున్నాడు. దగ్గరలో ఎవరూలేరు. ఎదర దుకాణాలన్నీ మూసేసి వున్నాయి. గేరేజ్‌లోని కుర్రాళ్లిద్దరు గేరేజ్ నీడలో పడివున్న కారు సీట్లమీద అస్తవ్యస్తంగా నిద్రపోతున్నారు. కిళ్లీబడ్డీ అతనికి తను కనిపించదు. దూరంగా జగదాంబాసెంటర్లో ఎండలో మాడిపోతున్న ఖాళీ రిక్షాలు. గత్యంతరంలేక గొడుగు నీడన నడుస్తున్న ఒకరిద్దరు జనంతప్ప సెంటరంతా నిర్మానుష్యంగా వుంది.

ఎండ తీవ్రతకి కాకపోతే, ఎల్లప్పుడూ హడావిడిగా ఉండే ఈ సెంటర్, ఇంత నిర్మానుష్యంగా ఉండటమా— అనుకున్నాడు అతను.

రెండు మూడు సార్లు వడివడిగా, కొద్ది కొద్దిగా వేడిగానే అయినా గాలి వీచింది. సేదతీరినట్లు అనిపించింది. హృదయం కుదుటపడ్డది. సన్నగిల్లిన శక్తి తిరిగి సర్దీ అయినట్లు అనిపించింది.

ఈ వేళ రోజు బాగోలేదు. ఇంటికి వెళిపోతేనో! అమ్మో తండ్రికి ముఖం చూపటం. చూపి అబద్ధం ఎలా చెప్పటం. తను అబద్ధాలు ఆడరాదనే కదా తాత తనకి "సత్య హరిశ్చంద్రుడు" అని పేరు పెట్టింది.

ఆయనో గాంధీ భక్తుడు. నిత్యమూ సత్యమునే పలుకుము అన్నది ఆయనకు నచ్చిన-ఆయన మెచ్చి ఖచ్చితంగా అమలు జరిపిన సూక్తి. తన తరువాత ఆ సూక్తిని తన మనవడైనా అమలు జరపాలని తలచి ఆ మేరకు మనవడి దగ్గర మాట తీసుకున్నాడు.

తాతకిచ్చిన మాట నిలుపుకోవటంలోనే మూడు వారాల క్రితం ఉద్యోగం ఊడగొట్టుకున్నాడు. అందుకు తండ్రికి తనకీ మధ్య ఘర్షణ కూడా జరిగింది. నాటినుంచి నేటి వరకూ తమిద్దరి మధ్యా మాటామంతీ లేదు.

తండ్రి ఉదయం ప్లీడరు గారింటికి వెళ్ళిపోతూ, బేంక్ మేనేజర్ సత్యమూర్తిగారు తనని మధ్యాహ్నం ఓసారి ఇంటి దగ్గర కలియమన్నారనీ ఎక్కడో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తారనీ చెప్పేడు.

"తప్పకుండా వెళ్ళు మీ! ఆయన చాలా మంచివారు మొన్న నువ్వు పోగొట్టుకున్న ఉద్యోగం కూడా ఆయనే యిప్పించారు. సరిగ్గా రెండింటికల్లా అక్కడుండాలి అన్నారు, ఏదో ఒక ఉద్యోగం" అన్న మాట నిలబెట్టుకోవటంలో ఆయన్ని మరో హరిశ్చంద్రుడంటారు అయితే చాలా తిక్కలున్నాయట.

ఖరా ఖండీ మనిషట. మాటంటేమాటే. పైనుంటే పైనే. చేస్తానంటే చేశాడే. తనలో ఉండటంతోసరిపెట్టుకోడు అందరూ అలా ఉండాలంటాడు.

చేతికి ఉన్న వాచీ చూసుకున్నాడు. ఒంటి గంటంపావు. దానికో పదినిమిషాలు కలిపేడు. అది తండ్రి తను పదవ తరగతి పాస్ అయినప్పుడు కొని యిచ్చిన సెకెండ్ హేండ్ వాచి. కాని నాలుగేళ్ళయ్యింది.

కొన్ని క్షణాల క్రితం తను పడ్డ స్థలం

## పునర్జన్మ

కాలవశమున పత్రాళి గోలుపోయి
మోడులైనంత మాత్రాన వ్రీడ గూరి
తుహిన దుఃఖాశ్రు ధారలతో గదగునె?
వసుమతీజములార! సువ్రతతులార!

జీవితంబన్న పూవుల సెజ్జకాదు
ప్రియులువారని వలపుల పేటికాదు
చేదుతీపులు పెనగొను క్ష్వాథరసము
విరతి యెరుగని ఆశాభిసరణయాత్ర.

అణ్వణువందు చైతన్య మావహిల్ల
వచ్చితిని నేడు మాధవ స్వామి నేను
చిగురు వలువలు తొడుగుడు! చేకొనుండు
పూల సొమ్ములు తావులు బుగులుకొనగ.

ఇది పునర్జన్మ మీకెల్ల నిదిగొ యిపుడె
భావి జీవన సౌఖ్య నాందీ స్తవంబు
పాడుచున్నది పికము సుస్వరము తార్చి
కొసరి శుకశారి భసలముల్ గొంతు కలుప.

ఒక్క జాజిలతా నీక మక్కజముగ
బాహ్యమై నిల్చె కుసుమ సౌభాగ్యమునకు
నవ్వు వారలతో గూడి నవ్వు గాని
యేడ్చు వారలతో జగం బేడ్వగలదె?

—శనగన నరసింహస్వామి

బస్సు వచ్చేదారి చూశాడు. రెండు బస్తాల బియ్యం లాక్కుంటూ నడిచిపోతున్న రిక్షా తాత కళ్ళ ముందు మెదిలేడు. ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా హఠాత్తుగా లేచి, సిరిపురం వేపుగా నడక సాగించేడు.

జేబులోని రుమాలు తీసి తలకు తురక కట్టుకట్టేడు. నెత్తిపదిలపడ్డా కళ్ళు ఎండ వెలుగుని భరించలేకపోతున్నాయి.

రిక్షా భారంగా మెల్లిగా నిండుచూలాలులా కదిలి వెళ్తోంది.

విసురుగా నాలుగు అడుగులు వేసి రిక్షాని అందుకున్నారు.

తాత తన బలం అంతా ఉపయోగించి రిక్షా లాగుతున్నాడు. కాళ్ళు బలంగా రోడ్డుకి తన్నిపెట్టి లాగుతున్నాడు. కాలి మీంచి జారి చెప్పుల్లో చేరిన చెమట కాళ్ళ పట్టుని అప్పుడప్పుడు సడలిస్తోంది. అలాంటప్పుడు రిక్షా తాతని తనతోపాటు వెనుకకు లాగేస్తుందేమోనని పిస్తోంది అతనికి. అవసరమైతే ఎందుకైనా మంచిదని రిక్షా వెనుకే నడుసున్నారు అతను.

ఒక్కొక్కసారి రిక్షా లాగుతున్నపుడు వెనుకబడ్డ కాలి మీదకి వెనుక చక్రం ఎక్కిపోతుందేమోనన్న భ్రమ కలుగుతోంది.

తాత పంటిమీది చెమట ధారలుకట్టి ప్రవహిస్తోంది. అరచేతిలో చెమటవల్ల వెనుక కడ్డీమీద చేతిపట్టు తరచు సడలిపోతోంది. ఆ కడ్డీమీద రబ్బరు ముక్క బదులు ఏదైనా గుడ్డముక్క వుంటే తాతకి ఇంత ఇబ్బంది వుండదేమో!

వెనుకనుంచితోసి సాయం చేస్తేనో! అతనికి తన చిన్నతనం జ్ఞప్తికి వచ్చింది. ఆ రోజుల్లో ఎగుడు కివెళ్లే ప్రతి రిక్షాని పనిమాలి వెనుక నుంచి తోసి రిక్షావాళ్లకు సాయం చేసేవారు. ఇప్పుడు తను అలా చేయగలడా? చుట్టూ చూసుకున్నాడు. అక్కడొకరూ ఇక్కడొకరూగా వున్నారు జనం.

తనలో తానే నవ్వుకొని రిక్షా వెనుక చెయ్యివేసి కాస్త బిడియంగానే తోయటం మొదలు పెట్టేడు.

తాత తల వెనక్కు తిప్పి నవ్వుతూ ఏదో అన్నాడు.

తనకు వినిపించనట్లే నటించేడు.

ఎవరైనా దగ్గర పడితే తోపుడు తగ్గించి రిక్షాని పట్టుకొని నడుస్తున్నాడు.

అలా చేయటంలో తాతకి ఎంతఇబ్బంది కలిగిస్తున్నాడో కొంతసేపటికిగాని కాసుకోలేకపోయేడు అతడు. బేషజం పూర్తిగా విడిచేసి తాతకి సహాయకుడిలా తన శక్తి మేరకు రిక్షాను తోయసాగేడు.

## ఉగాది వేడుక

బోడులైన మోడులన్నీ
అందంగా ఆనందంగా మళ్లీ ముస్తాబై
ముత్తుయిదువులవుతుంటే, ముద్దుగొలుకబోస్తుంటే
ఫలించిన వీరేశలింగం కలలా వుంది వసంతం
లిఖించిన చలం లేఖలా వుంది వసంతం
రేకురెప్పలు విప్పిన పూల కళ్లలో
పరిమళించే నిశ్శబ్ద భావమాధుర్యంతో
ప్రతిఫలించే కలల రమణీయ సౌందర్యంతో
వ్రాయని కృష్ణశాస్త్రి కవితలా వుంది వసంతం
గీయని బాపు బొమ్మలా వుంది వసంతం
మావి గుబురుల లోగిళ్లలో
లేచిగుళ్ల కౌగిళ్లలో
ఒదిగున్న కోకిల 'కూ....' అంటే
ఎదను మీటిన రాగమేదో ఓ....యంటే
చిట్టిబాబు వీణలా వుంది వసంతం
బాలమురళి వాణిలా వుంది వసంతం
పురివిప్పిన నెమళ్లలా పూల తరువులు
పెదవివిప్పిన వేదంలా శారికా నాదాలు
శుకపికాల మంగళ తోరణ తూర్యాలతో
ఊరేగ నిలచిన ఉగాది వేడుకలా వుంది వసంతం
తెలుగు భారతి కళ్యాణ వేదికలా వుంది వసంతం.

—మేకా మన్మధరావు

చెమట విపరీతంగా పట్టేస్తోంది అతనికి. ఇంతసేపూ లేనిది షర్ట్ క్రింద బనీను తడిసింది. శరీరానికి అంటుకునే మేరకు ఫేంటు కూడా తడిసిపోయింది. చెమట ఇబ్బందికరంగా వుంది. అంత చెమటను అతను ఎన్నడూ ఎరగడు. అయినా రిక్షాను తోయటం మాత్రం మానలేదు.

రిక్షా జడ్జీ కోర్టు సమీపించింది. వేప చెట్టు నీడన రిక్షా ఆపి రోడ్డు ప్రక్క రాయిని కాలితో లాగి వెనుక చక్రంకి అడ్డం వేసి, తలపాగా విప్పి ముఖం, కళ్ళు ఒళ్ళు తుడిచి బస్తాల మీద ఆరేసేడు తాత.

వేప చెట్టు నీడ చల్లగా హాయిగా ఉంది. ఎతున ఉండటం వల్ల గాలి ధారాళంగా వీస్తోంది. అక్కడ మంచం వేసుకొని పడుకోవాలి అనిపిస్తుంది ఎవరికైనా— అనుకుంటూ. రుమాలుతో మొహం చేతులు తుడుచుకున్నాడు అతను.

రుమాలు చెమట కంపుకొట్టింది. ఇంటికెళ్ళేక రుమాలు ఉతుక్కోవాలి అనుకున్నాడు.

సిటీ బస్సు ఇంకా రాలేదు.

"ఏం చదుగుతున్నావు బాబూ!"

అయ్యగారింటికి కదా అని ఉన్నవాటిల్లో మంచి బట్టలు వేసుకున్నాడు తను. అవి చూసి మోసపోయేడు తాత.

"చదవట్లేదు. మొన్నటిదాకా వాచ్‌మేన్ని. ఇప్పుడు అదీలేదు. మళ్ళా ఎక్కడో ఉద్యోగం ఇప్పిస్తారట ఒకాయన.

మా నాన్న వెళ్ళి రమ్మన్నాడు."

ముందు రిక్షా, వెనుక అతను.

రోడ్డు సమతలంగా ఉందేమో ప్రయాణం సజావుగానే సాగుతోంది.

ఇంకా నయం ఎదురు గాలి కాదు- అనుకున్నాడు అతను. గంజిపేట వేప చెట్టు క్రింద మరో మజిలీ- చిన్నదే. సిటీబస్ వచ్చిన పాపాన పోలేదు.

"బేరం ఎక్కడికి? బాడుగ ఎంత?" అడిగేడు అతను.

ప్రభాత్ టాకీసు వెనుక హాజీ జమాల్ దుకాణం నుంచి వాల్తేరులో కిరణా కొట్టుకి పన్నెండు రూపాయలట.

తక్కువో ఎక్కువో తేల్చుకోలేక పోయేడు అతను. ఇది వరకు తాను ఎరిగిన బేరాలతో బేరీజు వేసేడు. తక్కువేమో అనిపించింది. అదే అన్నాడు.

"ఏటి సెబుతాం" అంటూ తన కథ మొదలు పెట్టేడు తాత.

తాత రిక్షా తొక్కటం మానేసి అనేకంటే, అతనికొడుకు మానిపించేసి ఆర్నెలలు అయ్యిందట. నాటికి మళ్లా నేడే బండి తీసేడట. లేకపోతే ఈ బరువు తనకు ఉల్లాఘవా అన్నాడు. ఈ రోజు తను బండి తీయటం కొడుక్కి ఇష్టంలేదట. కానీ. రెక్కాడితేగానీ డొక్కాడని బ్రతుకులే అంటూ దీర్ఘం తీసేడు.

"మరి నీ కొడుకో" అంటూ మధ్యలో అడ్డు పచ్చేడు సత్యం.

"ఏటి- ప్రారబ్దం కాకపోతే!" అంటూ తిరిగి మొదలు పెట్టాడు.

మొన్న రాత్రి తాత కొడుకు రామ నగర్ గోతిలోకి బేరం కట్టేడట. తిరిగి పచ్చేటప్పుడు. ఎగుడు నడిపించి ఎక్కించుకొనిరాక పెడలేసుకొని వస్తున్నాడట. దిబ్బమీది స్టాండ్‌లోని రిక్షావాళ్ళు అతడ్ని చూసి హీరో.... హీరో.... అని ఎగతాళి చేసేరట. అసలే కుర్రాడు ఆపైన మంచి జబర్దైన మనిషి. పౌరుష పడిపోయి కాలు క్రింద పెట్టకుండా పెడలేసుకుంటూనే బండిని దిబ్బ ఎక్కించేసేడట.

కొందరు మెచ్చుకోలుగా చూసేరట.

ఓడినవాళ్ళు రెచ్చిపోయి మరుకో పందెం అన్నారట.

సై అంటే సై అన్నాడట.

వీడి జేబులోది ఎంతుంటే అంతా వీడు. మొత్తం వాళ్ళందరి జేబుల్లోనూ ఎంతుంటే అంతా వాళ్ళూ పందెం ఒడ్డేరట.

పందెం ఏంటి?

ఎగుడు మధ్యలో వాడి ఇష్టంవచ్చిన వాడ్ని- పిల్లలు పనికిరారు ఒక్కడ్ని మాత్రమే ఎక్కించుకొని ఎగుడు ఎక్కించాల కానీ. ఒక షరతు బండి బయల్దేరే ముందు పెడల్‌కీ వెనుక చక్రాలకీ మధ్య చైను తప్పించేస్తారు.

సరేనంటూ ఎగుడు మధ్యలో బండి ఆపి సుమార్దైన మనిషిని ఎక్కించుకొని సీటు మీద ఎక్కి కూర్చొని బారు మీదుగా వంగి ముందు చక్రాన్ని బలంగా పట్టుకొని వీడు రడీ అన్నాడట. వాళ్ళు చైను తప్పించేసారట.

ఇహ చూసుకోండి ఆ జంక్షన్ ఒక తిరనాళ్ళయిపోయిందట.

పందానికి ఉసికొల్పిన వాళ్ళని కొందరు తిట్టేరట.

వీడు గెలవాలని కొందరు బయటకి మొక్కుకున్నారట.

జనం వాళ్ళలో వాళ్ళు పందం ఒడ్డారట.

చాలా మంది వాడిని తెగ ఉత్సాహపరిచేరట.

అదేమైనా చిన్నాచితకా ఎగుడా! ఏ.వి.యన్. కాలేజీ ఎగుడికి తమ్ముడు. సైకిల్‌మీద సింగిల్స్ ఎక్కించటమే కష్టం. చాలా మంది మధ్యలో దిగిపోయి నడిపిస్తారు. ఎక్కడో కొందరు పిక్కబలం ఉన్న కుర్రకారు రిక్షా తొక్కుడు తొక్కి అతి కష్టంమీద ఆ ఎగుడిని ఎక్కిస్తారు.

అలాంటి ఎగుడులో—

ఒక మనిషి కూర్చోగా ఇంకో మనిషి తొక్కుతూ— అదీ చేతులతో.... అదీ అసాధ్యమైన రీతిలో కూర్చొని. బండిని వెనుకకు జారకుండా రెండు చేతులతోనూ ముందు చక్రాన్ని అదిమి పట్టాల. ఆపైన ఒక చేతి తరువాత ఒక చేయి మారుస్తూ ముందు చక్రాన్ని ముందుకు ఎగుడుపైకి నడపాల. బండి చేతుల్లోంచి జారితేనో!

## ఉగాది వాగ్దానాలు

జీవితాలంకారాలన్నీ పచ్చిక పరుపు మీద పరుస్తాను
అరుణ రక్త జ్వాలల్ని నుదుట విజయకేతనంగా ధరిస్తాను
కంటి కొసల కొబ్బరి చెట్ల మధ్య గాలి వీస్తూ గగనాన్ని మేస్తాను
చింపిరికళ్ళ చిటపటల మధ్య చినుకు రాలకుండా
నిశ్శబ్దాన్ని వర్షిస్తాను
గుండెలమీదుగా జారుతున్న అశ్రుజల బిందువుల్ని
ఉంగరాలుగా ధరిస్తాను
నీలిమంటల్ని ఆకాశంలో రగిల్చి నిప్పుల నక్షత్రాల్ని
మండువాలో అలంకరిస్తాను
కడుపు నొప్పితో బాధపడుతూ నల్లబడ్డ డబ్బుకు
మెరవడం నేర్పి ఉరుముల పుండ్రాళ్ళు చేసిపెడతాను
ఇంటినీ గుడినీ నిన్నూ నన్నూ నిక్షేపంగా విదేశాలకి
అమ్మేయగలవాళ్ళకి దేశాన్ని దానం చేసేస్తాను
ఎప్పటికీ సంప్రదాయాల ఇనప్పెట్టెను మాత్రం కాపాడుకుంటూ
కవితల్లో విప్లవాలు సృష్టిస్తూ అడవినిండా అప్పులు చేస్తాను
ఈ ఉగాది భోషాణాన్ని శుష్కవాగ్దానాల తెలుగు దేశాల
ఆత్మగౌరవాల పసుపు ముద్దల బంతిపూలతో నింపేస్తాను
మళ్ళీ వచ్చే ఉగాదికి భారత దేశాన్ని
బండరాళ్ళ బరువు పందాల గుర్రపుడెక్కల
చప్పుళ్ళతో నింపేస్తాను.

—డాక్టర్ సుమనశ్రీ

జనం బండి వెనుక కాపు కాసి నిలబడ్డారట. అవసరమైతే ఆపటానికి.

గంట సేపు కుస్తీ పట్టీ పట్టీ చివరికి ఎక్కించేడట.
ఆబాల గోపాలం అతనిని ఎత్తి కుదేసేరట. పిల్లలు జయ జయ ధ్వానాలు చేసేరట.

ఆడంగులు మెటికలు విరిచి దిష్టి తీసేరట.

ఆడు గెలుచుకున్నది పదిహేను. బహుమతులు పది. మొత్తం పాతిక.

ఒక రిక్షావాడికి గంటలో పాతిక రూపాయల కష్టార్జితం అంటే చెప్పుకో దగ్గదే.

"కానీ, ఏటి లాభం!" అంటూ నిశ్వసించేడు తాత.

"ఏమైంది?" ఆత్రంగా అడిగేడు సత్యం. అప్పైన చుట్టూ చూసేడు లాజరస్ బంగ్లా తోటలోని తురాయి చెట్టు నీడన తాము ఎప్పుడు ఆగేరో వాళ్ళిద్దరికీ తెలియదు.

"ఏటొద్ది! తెల్లారేసరికి ఒళ్ళు ఎరగని జ్వరం. సంపాదించిన పాతికా సూది మందుకీ బిళ్ళలకీ డాక్టర్ బాబుకీ ముడుపుగా చెల్లిపోయింది.

కొడుక్కి తెలివి వచ్చేక "ఏవి పనిరా!" అన్నాడట.

నీ కొడుకు పేరు ఎరగని రిక్షా నాయాళ్ల రేపీపాటికి ఈ వైజాగ్‌లోనే వుండరు పొమ్మన్నాడట. కుర్రతనం కుర్రచేష్టలు.

ముందు రిక్షా ప్రయాణం. వెనుక పాదయాత్ర.

తాత చెప్పిన కథకి సత్యం గుండెలు బరువెక్కిపోయేయి. రిక్షా తోయటమే మరచిపోయేడు. తాత కొడుకు రూపం ఊహించుకుంటున్నాడు.

రిక్షా మెల్లిగా సాగుతోంది. మళ్ళీ తోపుడు మొదలయ్యింది

"రిక్షా స్వంతమా? అద్దెదా?"

"సొంతమా! అద్దెదే! రోజుకి నాలుగు రూపాయలు"

"పంచర్లు వగైరా"

"రెండు మూడైతే మావే. ఆపైన యజమానివి"

"ఏక్సిడెంట్ అయితేనో!"

"తప్పు మాదైతే మరమ్మత్తుల కర్చు మాదే. రైటైతే మాకేంనేదు.

"బండి అద్దెపోను ఏ మాత్రం మిగుల్తుంది."

"దారికే బేరాలబట్టీ! ఒక్కోనాటి బండద్దె సంపాదించటమే కష్టం."

"నువ్వు! నీ కొడుకేనా!"

"ఇద్దరమే అయితే మా బాగే! రోగిష్టి ముసిల్ది. నిండు సూలాలు కోడలు. ఏడన్నర్థం మనవడు. అవిటి కూతురు."

"మరి వాళ్ళెవ్వరూ .... పాచిపనో.... ఇంకోటో...."

వినబడలేదో. వినిపించే జవాబు చెప్పటం ఇష్టం లేకనో ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు.

రోగిష్టి...., నిండు చూలాలు...., చంటోడు..... అవిటి.... ఏం పని చేయగలరులే_ అని తనకు తానే సమాధానం ఇచ్చుకున్నాడు.

రాఘవేంద్రస్వామి ఆలయం దాటేరు. రామనగర్ బస్‌స్టాప్ దగ్గర పడుతోంది.

"అదే.... రామనగర్! అల్లా కనబడుతోందే.... అదే క్రిష్టియన్ల సమాధులుండే గోడ. దాని ముందున్న రోడ్డు ఎగుడులోనే ఆడు పందెం కట్టింది"_ అంటూ రోడ్డుకి ఎడంవేపు బిల్డింగ్‌ల మీదుగా చూపేడు తాత. అతనికి తాత చూపిన గోడ కనబడలేదు.

కనబడుతున్న గవర్నరు బంగళా ఎగుడు ఎక్కిపోతే ప్రయాణం గట్టెక్కినట్టే. లాగుడు బాధ ఉండదు. కానీ, బ్రేక్ నొక్కిపట్టి జాగ్రత్తగా నడపాలి. లేకపోతే బండి బోల్తా కొట్టినా కొట్టేగల్దు. దిగుడు అన్నమాటే గాని అదీ కష్టమే. ఐతే గుడ్డిలో మెల్ల. ఎగుడు అంత బాధాకరం కాదు.

అదే మాట అన్నాడు-అతడు-తాతతో.

తాత నవ్వి ఊరుకున్నాడు.

రిక్షా కదుల్తూనే ఉంది. అలసిన సత్యం తోయటం మానేసాడు. తాత లాగటం ఆపలేదు. బలంగా లాగుతున్నాడు. అతని తలా నడుమూ రిక్షాబారుకీ సీటుకీ సమాంతరంగా వంగిపోయేయి. తలలో పుట్టిన చెమట నుదుటి మీదుగా కాల్వలు కట్టి, కనుబొమ్మల ఆనకట్టలు దాటి కళ్ళగుంటల్లోకి జారిపడుతున్నాయి.. తల ఎంత విదిలించుకున్నా కనుకొలకుల్లోకి చేరిన చమట కళ్ళు కనబడనీయటంలేదు కాటాను భుజంమీది తడిసిన బనీనుతో రిక్షా లాగుతూనే కళ్ళల్లో తడి ఒత్తుకుంటున్నాడు తాత.

అలవాటులేని తోపుడు. సత్యంలోని శక్తిని సన్నగిల్ల బరుస్తోంది! అయినా పట్టుదల. చెమటతో తడిసిన బట్టలు చిరాకుని పుట్టిస్తున్నాయి. గొంతుక ఎండిపోయి నాలుక పిడచగట్టుకుపోయింది. ఒంటిమీద చమట కంపు ముక్కుపుటాలకు చేరుతోంది.

రామనగర్ బస్ స్టాప్ వచ్చేసింది. బస్సు రాలేదు.

కిళ్ళీ బడ్డీ కనబడింది. సోడా తాగాలనిపించింది.

తాత కూడా తాగుతాడేమో!! ఇద్దరికీ అర్ధరూపాయి. ఉన్న చిల్లర పావలా పది

# నీ కోసం ఆరాటం

అమ్మయ్య!
వచ్చేశావా ఉగాదీ!
ఇంక శాంతిస్తుందేమో నా మది.
రక్తాక్షి ఉద్రేకం
రానురాను మితిమీరుతుంటే.
రక్షించేవారి కోసం పరితపించి పోయాం
అంగరక్షకుల చేతే అమ్మను చంపిస్తే
మతిపోయి. కలతపడిపోయాం.
బతుకు తెరువు చూపించే కర్మాగారం చేతే
విషవాయువులు కక్కింది
వేలాది ప్రాణాల్ని బలిగొంటుంటే
ప్రాణాలు పిడికిట పెట్టుకొని
ఎదురుచూశాం.

పెనుతుఫానుల రేకెత్తించి
సర్వనాశనం చేస్తుంటే
రక్తాశ్రువులే చిందాయి చివరికి.
పేపర్లో ఏముందని పెద్దరికమిచ్చి.
ఆదరిస్తే_
అదరగొట్టి మరి వెళ్ళింది రక్తాక్షి.

కాశ్మీరులో కలహాలు.
దక్షిణ భారతంలో దురాగతాలు.
చిందర వందర భారతిలో
చిరు వెలుగులా వచ్చావు
అందుకనే_
ఆరిపోలేదు మాలోని ఆశాదీపం
మారిపోలేదు తెలుగువారి తేజస్వరూపం.
తీరిపోయిన బంధాలు తలుచుకొని
కుమిలిపోతూ. నిన్ను నిరాశపరుస్తా మనుకోకు
చేతనున్న వర్తమానం- వృధాగా జారిపోకుండా
కాస్త చేయూతనిస్తే చాలు మాకు.
ముళ్ళపొదల్లా పెరిగిపోయిన అత్యాచారాలపై
క్రోధనా! చూపించు నీ క్రోధం.
ఆర్తుల ఆక్రోశాలను
పైకంగా మార్చుకొనే పైశాచిక ప్రవృత్తులపై
చూపించాలి నీ క్రోధం!
ఒక చెట్టు కొమ్మలు నరికి
మరో చెట్టుకు అతికించాలని
పూలలోని మకరందాన్ని
ముళ్ళకు అందించాలని
వ్యర్థప్రయత్నాలు చేసే వంచకులపై
క్రోధనా! చూపించు నీ క్రోధం.

-శ్రీమతి స్వరాజ్యం రామకృష్ణ

నోటు.... బడ్డీవాడు... చిల్లర....తాతను తీసుకెళ్ళాకా తీరా చిల్లర లేదంటేనో! ఎటూ తేల్చుకోలేక

"ఒక్క ఘడియ బండి ఆపు తాతా! సోడా ఒకటి తాగితే" అన్నాడు అతను.

"మీరు తాగండి బాబూ! తాగితే బండి నాగలేను పట్టు ఆపినా అంతే నేను మెల్లిగా నా గుతుంటా లెండి" అంటూ రిక్షను తానొక్కడే లాక్కుపోతున్నాడు.

అలవాటు తప్పడం వల్లనో లేక బండిలో ఉన్న బరువు వల్లనో హేండిల్ బార్ వణుకుతూ బండినీ ముందుకు సరిగ్గా పోనివ్వటంలేదు.

అక్కడ్నుంచి ఎగుడు క్రమం వెనకటి కన్నా ఎక్కువ ఈ రీతిన తాత బండిని ఎక్కించటం చాలాకష్టం. సోడా తాగుతూ తాతనే గమనిస్తున్నాడు.

చేతిలోంచి జారిపోతున్న వెనుక కడ్డీని విశ్వప్రయత్నంతో పట్టి ఉంచటానికి శ్రమ పడుతున్న తాతను చూడగానే సోడా గబగబా పూర్తిచేసి తలమీద రుమాలుతీసి తాత చేతిపట్టుకు ఇవ్వను పరుగు పెట్టేడు.

అతను శంకిస్తున్నట్లుగానే వెనక్కి సాచి ఉంచిన చేతిలోని కడ్డీ జారింది. బార్ తాతను చిన్న విసురు విసిరింది. రిక్షా మెలికలు తిరిగిండి. దాన్ని ఆప తాత తరమా!

అవాక్కైపోయి ఎక్కడవాడు అక్కడే చోద్యం చూస్తున్నట్లుగా నిల్చుండిపోయేడు సత్యం.

పది అడుగులు వంకర టింకరగా జారిన రిక్షా వెనుక చక్రం. రోడ్డు మీది గోతిలో దిగబడి మళ్ళీ వేగం పుంజుకునే లోపల తాత పరిగెత్తుకొచ్చి ఒడుపుగా వెనుక కడ్డీని పట్టి. వెనుక బ్రేక్ లివర్ని అందుకొని సంధించిన బాణం లాగినట్టుగా పట్టి బండిని ఆపేడు. రెండు మూడు సార్లు గుండెల్నిండా గాలి పీల్చి వెనుక చక్రం పొజిషన్ అనుకూలంగా ఉండడంతో ఒక్క అదుటున ముందుకు లాగేడు.

అదేసమయంలో ఎగుడులోంచి దిగువకి చేతులు వదిలేసి స్పీడుగా వస్తున్న స్కూటర్ వాలా గాభరాపడిపోయి హఠాత్తుగా బార్‌మీద చేతులు వేసేడు. రిక్షా కవతల ఏం జరిగిందో తెలియదు స్కూటర్ బ్రేకులు కీచుమన్నాయి.

మరుక్షణం రిక్షా తిరగబడిపోయింది. స్కూటర్ రెండో పక్కకు పడిపోయింది.

ఎవరిదో వెర్రికేక.

రిక్షా క్రింద వెల్లికిలా తాత. స్కూటర్ మీద బోరగిలా కుర్రాడు.

సత్యం ఒక్క పరుగున అక్కడకు చేరేడు.

తాత రిక్షాకి ప్రక్కగా పడ్డాడు. చూడటానికి క్రిందపడినట్లే వుంది. ఊత ఇచ్చి నిలబెట్టేడు. తొడ కొద్దిగా చీరుకుపోయింది. రక్తం పెద్దగా రావటం లేదు. అటూ ఇటూ నాలుగు అడుగులు వేయించి ఏమీ కాలేదని ధైర్యం చెప్పేడు.

ఈ లోపున స్కూటర్ కుర్రాడు లేచి నుంచున్నాడు. లేచి నుంచున్న తాతను చూసి పడిపోయిన స్కూటర్ని లేవనెత్తాడు.

అతనికి దెబ్బలు ఏమీ తగలలేదు. ఫేంటు లోపల ఎక్కడో చెక్కుకుపోయి వుండొచ్చు.

స్కూటర్ ముందు భాగం లొత్తపడిపోయింది.

రిక్షా వెనుక చక్రాలు రెండూ ఎనిమిదంకె ఆకారంలో వంగిపోయేయి. ఒక బస్తా చిట్లిపోయి అందులోంచి బియ్యం ధారగా జారి కుప్ప పడుతున్నాయి.

ఈ లోపున చుట్టు ప్రక్కల ఇళ్ళల్లోంచి ఓ నలుగురు దగ్గర్లోనే కొత్తగా కడుతున్న హోటల్ పనివాళ్ళు కొందరూ పరుగెత్తుకొచ్చారు.

ఒకరిద్దరు స్కూటర్ కుర్రాడ్ని పట్టుకున్నారు.

కొందరు అతన్ని నోటికొచ్చినట్లు తిడుతున్నారు.

ఒక ఇద్దరు చేయి చేసుకోబోతే మరి కొందరు ఆపేరు.

అతను తన తప్పేం లేదని అడిగిన వాళ్ళనీ అడగని వాళ్ళనీ నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.

"కాయ్...కాయ్..."అన్నారుకొందరు

"నీకు లైసెన్సుందా," అన్నాడు ఒకడు.

కుర్రాడు గాభరా పడిపోతున్నాడు.

"బండెందుకు ముట్టుకున్నావ్. ఏక్సిడెంట్ అయిన బండిని అలాముట్టుకోవటం తప్పు తెల్సా!" అంటూ ఝుడిపించేడు మరుకొకడు.

"నువ్వు చేతులు వదిలేసి బండి తొక్కటం మేం చూడలేదనుకున్నావా!" మూడోవాడు.

"అప్పుడే అనుకున్నాం ఏక్సిడెంట్ అయితేగాని అయ్యగారి రోగం కుదరదని" నాలుగోవాడు.

"అంతే! అటు తిరిగి చూద్దుంకదా కీచుమంటూ శబ్దం....ధనేలు.... కుయ్యో మొర్రో....పరుగెత్తుకొచ్చేం...." ఐదు. ఆరు. ఏడు. ఎనిమిదోవాడు.

ఇలా తలో మాట విసిరి తప్పంతా అతనిదే అని తేల్చిపారేసేరు.

అక్కడ నోరు విప్పనిది ఇద్దరే ఇద్దరు తాత. సత్యం.

తాతకు దిక్కు తోచక నోరు రావటం లేదు- ఎవరేమి అడిగినా మాట్లాడటంలేదు,

ఏక్సిడెంట్ వల్ల అతని మతి చలించింది అన్నారు కొందరు.

అసలు కారణం ఊహించేర్లవాడు వాళ్ళలో సత్యం ఒక్కడే.

ఎవరో సోడా తెప్పించి తాతకు పట్టిస్తున్నారు.

"ఏక్సిడెంట్ అయినప్పుడు మీరు ఎవరూ

## క్రోధన! రావే! కూరిమి తేవే!

క్రోధన నూతన వత్సర భామా!
కోపముతో వేంచేయకు లేమా!
రౌద్రాకారపు రుధిరోద్గారివి
రక్తాక్షీ సమరావని భేరివి
తలచిన మనుజుల ఎదలే అవియును
కలతలు పెల్లై బుజ్జిలం గవియును
తత్సంవత్సర సరణిని రాకుము
ధ్వంసము నీ ధ్యేయమ్ముగ రాకుము
గడచిన వర్షద్వయ కాలమ్మున
గడిబిడి గజిబిజి కానగవచ్చెను
మత కల్లోలము లెక్కువ ఆయెను
మమతలు మనుజుల త్యజించి పోయెను.

వర్షాభావము పంటల మాడ్చెను
వరదలు ఒకచో పంటల నూడ్చెను.
విషభరితానిల విస్తృత ఖేలలు
వేలకు వేల జనమ్ముల జంపెను.

మానవ హృదిలో నైరాశ్యమ్ము
మానవ మదిలో నిస్తేజమ్ము
మానవ పథమున దుర్ధ్వాంతమ్ము
మానవ మతమున మాలిన్యమ్ము
మాపగ రావే! ఆపగ రావే!
మా యావేదన బాపగ రావే!

మల్లెలు మొల్లలు కొల్లగ పూయగ
మామిడి గున్నలు పిందెలు వేయగ
మత్తపికమ్ములు కమ్మగ పాడగ
మయూర బృందము నాట్యమాడగ
రావే! రావే! రమణీయముగా
రావే! క్రోధన! రాగయశోధన!

ప్రేమ పృషత్తులు మాపై చిలుకగ
ప్రియవచనమ్ములు మాకై పలుకగ
మంచితనానికి విలువలు పెంచగ
వంచక లోకము త్వరలో త్రుంచగ
క్రొన్నన పథమున కులుకుచు రావే!
క్రోధన రావే! కూరిమి తేవే!

—కనమలూరు వెంకటశివయ్య

రేసు. ఆయన దగ్గరలో ఉన్నాడు.ఆయన్ని చెప్పమనండి. తప్పెవరిదో" అంటూ సత్యంని సాక్ష్యం వేసుకున్నాడు కుర్రాడు.

కుర్రాడ్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది సత్యానికి.

జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ తాతను చూసేడు.

తాత తలవంచుకున్నాడు.

మళ్ళా కుర్రాడ్ని చూసేడు.

సాక్ష్యం తనకు అనుకూలంగా వస్తుందన్న భరోసా కనిపిస్తోంది కుర్రాళ్ళో.

తలవంచి రోడ్డుని చూసేడు.

రోడ్డుకి మధ్యగా తెల్లని గీతల తారు.

దానికి మూడు అడుగుల ఎడంగా ఎడంవేపు బోల్తా పడ్డ రిక్షా. కుడివేపు రెండు అడుగుల ఎడంగా మొదలై తెల్లగీతను ఇంటూ మార్కులా కొట్టేస్తూ ఎడంవేపు రిక్షాదాకా వచ్చిన-స్కూటర్ సడన్ బ్రేక్ వల్ల ఏర్పడిన- నల్లని చార.

సత్యం తల ఎత్తేడు.

"చెప్పవయ్యా! భయమెందుకు" కూలీలు.

"అతనిదే!" అంటూ కుర్రాడిని చూపి గుంపులోంచి బయటపడి దూరంగా వెళ్ళి నుంచున్నాడు సత్యం.

తాత అతడ్ని ఒక్కసారి కళ్ళెత్తిచూసి ముఖంమరింత క్రిందకు దించేసుకున్నాడు.

మిగిలిన వాళ్లు బేరం సెటిల్‌చేసి కుర్రాడి నుంచి డబ్బులు వసూలు చేసి తాత చేతిలో పెట్టి ఎవరికి తోచిన సలహా వాళ్లు ఇచ్చి ఎవరి దారిన వాళ్లు వెళ్ళిపోయారు.

తన చేతిలోని డబ్బుని. రిక్షాని.దూరంగా మెల్లగా. గవర్నరు బంగళా ఎగుడికి భారంగా ఎగ బాకు తున్న సత్యాన్ని. అతడ్నే వెనుదిరిగి చూస్తూ రయ్యిమని సిరిపురం వేపు సాగిపోతున్న కుర్రాడ్ని అయోమయంగా చూస్తూ మరో రిక్షాకోసం దగ్గరలో ఉన్న నీడపట్టున చేరి చతికిల పడిపోయాడు తాత.

తుది సారిగా సత్యం కోసం ఎగుడులో వెదకబోయేడు తాత.

చెమ్మగిల్లిన కళ్ళకు సత్యం రూపం అలుక్కుపోయినట్లుగా కనిపించింది.

గవర్నరు బంగళా ఎగుడు చేరేసరికి సత్యం మనసులో వేయి సందేహాలు. తప్పు నిజంగా కుర్రాడిదేనా? అయితే అతడి చూపుల్లో ఆ భరోసా ఎక్కణ్ణుంచొచ్చింది? తాత కూడా ఎందుకలా కలవర పడిపోతున్నాడు? మందికి ఝడిసి తను మాట మార్చేడా?

అంతరంగంలోకి చూసుకుంటే తను అబద్ధమాడినట్టు కనిపించడంలేదు.

సడన్‌గా అతనికి జ్ఞాపకం వచ్చింది. ఆ అబ్బాయి ఎవరో కాదు. సత్యమూర్తిగారి కొడుకు. తను అతడ్ని పోల్చినా పోల్చక పోయినా ఆఅబ్బాయి పోల్చినట్లేఅన్నాడు.

సత్యం గుండె గుభేలు మనగా ఒక్క క్షణం అలా నిలబడి పోయేడు. ఇంకెందుకూ అక్కడికి వెళ్ళడం అనుకుంటూనే నెమ్మదిగా అడుగులుముందు కేవేస్తున్నాడు.

ఏది సత్యం ఏది అసత్యం అన్న విచికిత్స చాలా జటిలమైనది.

ఆరు నెలల క్రితం ఒక ఆఫీసు గొడవలో తనకు తెలిసిన నిజం తను బయటపెట్టేడు. పెద్ద వాళ్ళ కక్ష తన ఉద్యోగం ఊడగొట్టింది. అందుకు ఇంతవరకూ అతడు పశ్చాత్తాప పడలేదు.

ఇవేళ తానిచ్చిన సాక్ష్యంవల్ల తన ఉద్యోగావకాశం అడుగంటి పోవచ్చు. అయినా అతని మనసులో పశ్చాత్తాపం జాడలు కనిపించటం లేదు.

అంచేత. ఏమైతే అదే అయ్యిందని అతడు ముందుకే వెళ్ళదలుచుకున్నాడు. వెళ్తూనే వున్నాడు.



మీ చర్మాన్ని రసాయనిక లోషన్ల కరుకుదనానికి పాలుచేయడం సరియైనది కాదు.

మీ చర్మంతో కొత్త పాయిజ్ హెర్బల్ స్కిన్ లోషన్ కలియనియ్యండి.



ఇది వంటిపైన గల మొటిమలు, పొక్కులు యితర వికారాల నుంచి రక్షణను యిస్తుంది.

అందమైన వళ్ళు ప్రకృతి యిచ్చే వరం. అయితే మరి ఆ చర్మం అలాగే ఉండిపోదుగదా ! మొటిమలు, పొక్కులూ రావడం మొదలెడతాయి మరి. అందమైన చర్మం కాస్తా పాడై పోతుందిక. కరుకైన రసాయనాల ఆధారంగా తయారైన ఉత్పాదనల వల్ల మరింత ఎక్కువగా నష్టం కలగవచ్చు.

అదృష్టవశాత్తు, యిప్పుడిక మీ చర్మపు రక్షణ సంరక్షణ వీటికోసం సురక్షితమైన ఉపాయం ఒకటి వుంది. పాయిజ్ హెర్బల్ స్కిన్ లోషన్. దీని ప్రాకృతికమైన ఆయుర్వేద తత్వాలతో యిది మీ చర్మానికి ఏరకమైన నష్టాన్ని కలిగించకుండానే, మొటిమలు, పొక్కులు, యితర వికారాలనూ పోగొడుతుంది. మీ చర్మాన్ని మీక్కావలసినట్టుగా ఉంచుతుంది.

**పాయిజ్ హెర్బల్ స్కిన్ లోషన్—
మీ చర్మానికి దీని అవసరం వుంది
ప్రతి రోజూ.**

**పాయిజ్**
హెర్బల్ స్కిన్ లోషన్.

ప్రత్యేకమైన, ఆయుర్వేదపు ఉత్పాదన




మార్కెట్ చేసేవారు : రాలీస్ (ఇండియా) లిమిటెడ్,
బొంబాయి 400 001.

ULKA-RPH-1-85 TEL